ఓంశ్రీసాయిరాం

# శీలపోషణ

*తిలమధ్యే యథా తైలం క్షీరమధ్యే యథా ఘృతమ్*
*పుష్పమధ్యే యథా గంధం ఫలమధ్యే యథా రసమ్*
*కాష్టాగ్నివత్ ప్రకాశేత్ తల్లింగం అచలంప్రభో.*

తిలలయందు తైలము ఉండినట్లుగా, పాలలో వెన్న ఉండినట్లుగా, పుష్పమునందు చక్కని సుగంధము ఉండినట్లు, ఫలములో రసము ఉండినట్లు, కట్టెలలో నిప్పు ఉండినట్లు విశాలమైన, అనంతమైన ఈ జగత్తునందు దైవము కూడి ఉన్నాడు. జగత్తునందున్న మాధవుడు మానవ శరీరమందుకూడా ఉన్నాడు. ఏవిధంగా ఉన్నాడు మానవునియందు? కన్నులలో చూపు ఉండినట్లుగా, చెవులలో శబ్దము ఉండినట్లుగా దేహమునందు చైతన్య స్వరూపుడై ఉంటున్నాడు. సృష్టి అనగా ఈశ్వరేచ్ఛకు రూపమే. ఈ ప్రకృతి ఈశ్వరుని నుండియే ఆవిర్భవించింది. ఈ ప్రకృతియందు జన్మించిన ప్రతి మానవుడు ఈశ్వర భావమునే కల్గి ఉండాలి. మానవునియందున్న చైతన్యమును ఆవ్భివింపచేసే నిమిత్తమై మూర్తీభవించినవాడే మానవుడు. మానవునకు ప్రధానమైన గుణములుకూడా ఉండాలి. ప్రకృతిలో సత్వ, రజ, స్తమోగుణములుండినట్లు, ప్రకృతినుండి ఆవిర్భవించిన మానవునకు ఈ మూడు గుణములు ఉండాలి. అదియే 'ద'కార త్రయము. devotion మొదటిది. disclipine రెండవది. duty మూడవది.

యువతీయువకులారా!

మీరందరూ మంచివారే. కానీ, disclipine మీరు గుర్తించి వర్తించాలి. ఈ disclipine లో పవిత్రమైన కాలమును వ్యర్థము కాకుండా చూచుకోవాలి. ఇప్పుడు మీరు యేవిధముగా కాలమును వ్యర్థము చేస్తున్నారు? ప్రతి విషయమునకు చిత్రముకానీ, విచిత్రముగాని అన్నింటికీ క్లాప్స్ వేయటము. దీని వలన టైము వేస్టు అయిపోతున్నాది. ఈ క్లాప్స్‌కు విలువ లేకుండా పోతున్నాది. మానవుడు పవిత్రమైన విలువ కల్గినవాడు. అతను చేసే ప్రతి పనికి విలువ ఉండాలి. ఈ disclipine మీరు ఆచరించి యితరులకు అందించుటకు ప్రయత్నించాలి. ఈనాడు ప్రపంచము కోల్పోయినది ఈ డిసిప్లినే. డిసిప్లిన్ అంటే వారికి యేమీ తెలియటం లేదు. సమావేశములో పోయి కూర్చోటము, నాయకులు మాట్లాడిన ప్రతి మాటకు క్లాప్స్ వేయటము. ఇది కేవలము దురభ్యాసమే. ఇది మంచిది కాదు. ఇందులో కాలముకూడా చాలా వ్యర్థమైపోతుంది. ఒక్క క్షణము వేస్టు అయితే ఎంతో జీవితములో వేస్టు అయినట్టుగా ఉంటుంది. ఒక్క క్షణము కూడా వేస్టు చేయకూడదు. ప్రతి సెకను చాలా పవిత్రముగా వినియోగించాలి. ఈ డిసిప్లిన్ ఎప్పుడు మనకు ప్రాప్తిస్తుంది?

*శీలం ప్రాణ సమానం*

ఈ వయస్సులో చాలా ప్రధానమైనది, ప్రాణ సమానమైనది శీలము. ఇట్టి ప్రాణ సమానమైన శీలమును చక్కగా పోషించుకోవాలి. ఈ వయస్సు గోల్డెన్ వయస్సు. ఇలాంటి పవిత్రమైన వయస్సును మనం నిర్మూలం గావించుకుంటే భవిష్యత్తులో మన జీవితం నిర్మూలమైపోతుంది. మొక్క చక్కగా ఉండినప్పుడే చెట్టు చక్కగా బటలుదేరుతుంది. కనుక, stat early, drive slowly, reach safely. ఇది మంచి సమయము. మంచి seedling వయస్సు. ఇది చక్కగా వచ్చిందంటే చెట్టంతా చక్కగా వస్తుంది. ఈ వయస్సును అతి జాగ్రత్తగా మనము వినియోగము చేయాలి. ఏ దేశము వారైనా, ఏ కాలము వారైనా, ఏ స్థితికి సంబంధించిన వారైనా disclipine, character ప్రధనమైన

నేత్రాలు. అమెరికావారు ఏవిధంగా ప్రవర్తించాలి, జర్మనీవారు ఏవిధంగా ప్రవర్తించాలి, రష్యావారు ఏవిధంగా ప్రవర్తించాలి అనే ప్రశ్నలు మనకు అవసరము లేదు. ఏ దేశమువారైనా నీవు మానవుడుగా ఉంటున్నావు. caste of humanity, religion of love, language of the heart. ఈ సత్యమును మనం గుర్తించుకున్నప్పుడు ఏ దేశము వారైతే మనకేమి? ఏ దేశమువారైనా ఈ వయస్సులో మాత్రము ప్రాణసమానముగా కాపాడుకోవాలి మనయొక్క శీలమును.

ప్రాచీన మహర్షులు, ప్రాచీన యువకులు ఈవిధమైన గుణములు కాపాడుకుంటూ రావటం చేత వారు చరిత్రకారులుగా రూపొందారు. history అనగా ఏమిటి? his story. ఎవరి story? character ఉన్నవాని story. ఇదే his story. మనము చరిత్రకారులుగా రూపొందవలెనంటే మనము మన శీలసంపత్తిని కాపాడుకోవాలి. ఈ వయస్సులో ఈ శీలమును మనం పోషించుకున్నప్పుడే మన సంతతి, మన జాతి, మన కులము సర్వమూ ఆదర్శవంతమైనదిగా తయారౌతుంది. వ్యక్తి పవిత్రుడైనప్పుడే సమాజము పవిత్రమౌతుంది. సమాజము పవిత్రమైనప్పుడు దేశము పవిత్రమౌతుంది. దేశము పవిత్రమైన్పుడు ప్రపంచము పవిత్రమైనదిగా రూపొందుతుంది. కనుక, ఈనాడు ప్రపంచము సరైన స్థితిలో లేదనుకుంటే వ్యక్తియొక్క దోషమే దీనికి మూలకారణము. మనము అధికంగా మాట్లాడకూడదు. దాని వల్ల మన శీలము కొంచెం దెబ్బ తింటుంది. అధికంగా మాట్లాడే వారిని చూస్తే కొంతమంది వెళ్లిపోతారు. శీలము లేని వారిని చూస్తే పూర్వము వారు పామును చూచినట్లుగా బెదిరిపోయి పారిపోయేవారు. ప్రతి చరిత్రకారుని స్వరూపాన్ని విచారణ చేసినప్పుడు ఇందులో పవిత్రమైనది శీలము. మూడు భాగములు శీలమే పవిత్రమైనదిగా నిరూపిస్తుంది.

*రామలక్ష్మణుల పవిత్రశీలం*

మన చరిత్ర పవిత్రమైన రీతిగా విచారణచేసి చూచినప్పుడు ఒక్కొక్క వ్యక్తి తన చూపులు, తన శ్రవణము, తన పలుకులు ఎంత కంట్రోలులో పెట్టుకొని ఉండేవారో చూచుకోవచ్చు. ఒక చిన్న ఉదాహరణము. శివధనుస్సు విరిచిన తరువాత శ్రీరాచంద్రునికి సీతనిచ్చి వివాహము చేసేదానికి సిద్ధమయ్యాడు జనకమహారాజు. కానీ, దీనికి పూర్వము ఒక్క క్షణమైనా సీతను రాముడు చూచి ఎరుగడు. వివాహము కాక పూర్వము ఆమె పరస్త్రీ. పర స్త్రీని కన్నెత్తి చూడకూడదు. శ్రీరామచంద్రుని శీలముయొక్క పవిత్రత. దీని బాధ్యత తల్లిదండ్రులు చూచూకుంటారు. చూడకూడదని ఉన్నాడు. పెండ్లి పీటలపై కూర్చున్నారు. మంగళసూత్రము కట్టముందు లేచి నిల్చున్నారు. సీత ఎడమభాగములో ఉన్నప్పుడు రాముడు కుడివైపు కూర్చున్నాడు. ప్రక్కనే ఉన్న జనకమహారాజు చెబుతున్నాడు, 'ఇయం సీతా, రామా! సీత యిక్కడున్నది. నీవు ఎక్కడో చూస్తున్నావు' అన్నాడు. అనేక పర్యాయములు చెప్పాడు. ఏమాత్రమూ లెక్కచేయలేదు. కారణం ఏమిటి? ఇంకా మంగళసూత్రం కట్టలేదు. ఆ స్త్రీని మనం చూడకూడదు. ఇలాంటి ఆదర్శము జగత్తునకందించిన వాడు చరిత్రపురుషుడు శ్రీరామచంద్రుడు.

ఆ సోదరులందరూ ఆవిధంగానే ప్రవర్తించారు. శ్రీరామునితో లక్ష్మణుడు అరణ్యమునకు బయలుదేరి వెళ్లాడు. ఒక దినము రెండు దినములు కాదు. పదునాలుగు సంవత్సరములు. వీరివెంట సీతకూడా ఉంటున్నది. సీత చాలా యువకురాలు. పదునెనిమిది సంవత్సరముల వయస్సు. ఇరవై సంవత్సరముల వయస్సుకలిగిన రామలక్ష్మణులు వెంటనే ఉంటున్నప్పుడు ఈ పదునాలుగు సంవత్సరములు సీత ముఖము చూచి ఎరుగడు లక్ష్మణుడు. సీతను రావణుడు తీసుకుపోయిన తర్వాత లక్ష్మణుడు, రాముడు సీతను వెతుక్కుంటూ వెడుతున్నారు. ఒక పర్వతముపై హనుమంతుడు వుండేవాడు. ఆ జన సమూహమును చూచి సీత తన నగలను మూట కట్టి ఆ పర్వతముపై వదలిపెట్టింది. సీతాన్వేషణ నిమిత్తమై పోతున్న సమయంలో సుగ్రీవుడు వారికి స్నేహమయ్యాడు. వీరి చరిత్ర సుగ్రీవునికి చెప్పారు. సీతను తీసుకుపోయారు ఎవరో. వారిని వెతకటానికి మీ సహాయము

అత్యవసరమన్నాడు. ఆ మాట విన్న తక్షణమే సుగ్రీవుడు ఒక మూట తెచ్చి యిచ్చాడు. ఈ నగలు సీతమ్మవేనా చూడండి అన్నాడు. రామునికి కూడా భార్య నగలు ఏవో తెలియవు. అప్పుడు లక్ష్మణుని ముందు పెట్టాడు. 'లక్ష్మణా! ఈ నగలు మీ వదినవేమో చూడు'అన్నాడు. అప్పుడు చెప్పాడు, 'ఈ కంఠహారము ఎవరిదో తెలియదు. ఈ కంకణములు ఎవరివో తెలియదు. కానీ, కాలి అందెలు మాత్రము సీతవే అని నాకు చక్కగా తెలుసు' అన్నాడు. 'ఆ అందెలు మాత్రం నీకు ఎట్లా తెలుసు?' అడిగాడు. 'ఆమెకు దినమూ పాదాభివందనం చేసేవాడిని. ఆమెయొక్క పాదములపై ఈ నగలున్నవి. చూచాను' అన్నాడు. పదునాలుగు సంవత్సరములు అడవిలో ఉండినప్పటికీ ఒక్క క్షణమైనా సీత ముఖము చూచి ఎరుగడు లక్ష్మణుడు. ఈవిధమైన శీలము పోషించుకుంటూ రావటంచేత వారు ఆదర్శపురుషులుగా రూపొందుతూ వచ్చారు.

*సేవకులే నిజమైన నాయకులు*

మనము దివ్యమైన జీవితమునకు, కళనిచ్చే జీవితమునకు శాంతికిరణమైన శీలము ఈనాడు స్త్రీలుగానీ, పురుషులుగానీ ప్రాణసమానముగా తీసుకోవాలి. కొంతమంది యువకులు గ్రామసేవకై పోతున్నారు. సేవలు చేయటం చాలా గొప్పదనము.

*న తపాంసి న తీర్థాని న శాస్త్రాణి జపానహి*
*సంసార సాగరోద్ధారే సజ్జనం సేవనం వినా.*

మనము తపస్సుచేయకపోయననూ ఫరవాలేదు. ఏ తీర్థయాత్రలు చేయకపోయినా ఫరవాలేదు. ఏ పవిత్ర క్షేత్రము దర్శించకపోయినా ఫరవాలేదు. సేవకత్వమందే నాయకత్వముంటున్నాది. ఈ సేవలు సల్పిన వానికే శాంతి చేకూరుతుంది. ఈ సేవల వలన తనయందున్న అహంకారము నిర్మూలమువుతుంది.

వాల్మీకి రామాయణము వ్రాసి ఒకనాడు ఆ రామాయణము ముందు పెట్టుకొని విచారముచేస్తూ కూర్చున్నాడు. 'ఈ పవిత్ర చరిత్ర వ్రాసాను. ఈ పవిత్ర చరిత్ర సార్థకము గావించుకోవాలంటే దీనికి ప్రచార ప్రబోధలు అత్యవసరము. ఎవరు దీనిని ప్రచారము చేయగలరు?' అని యోచిస్తూ ఉండినాడు. ఆసమయమునకు ఇద్దరు చిన్న పిల్లలు పరుగెత్తి వచ్చారు. వారే లవకుశులు. 'గురూజీ! ఏమి మీరు యోచిస్తున్నారు?' అడిగారు. 'నాయనా! పవిత్రమైన రామచరిత్ర నేను రచించాను. సమాజమునకు అందించాలి. ఆదర్శమైన గుణములు సమాజమునకందించాలి. దివ్యమైన రాముని సత్కీర్తి ప్రపంచములో వ్యాపించాలి. వారి శీలసంపత్తిని ప్రతి వ్యక్తికి చేర్చాలి. ఎవరు చెప్తారా అని యోచిస్తున్నాను' అన్నాడు. చేతులు కట్టుకున్నారు పిల్లలు. 'గురూజీ! మాకు ప్రాణమున్నది. మేము మీ శిష్యులము. ఈ పనికి మేము రక్తమునైనా ధారపోస్తాము. ఈ సేవకు మేము జీవితమునే అంకితము చేస్తాము. మీరు ఆజ్ఞాపించండి. మేము ప్రచారము చేస్తాము' అన్నారు. వాల్మీకి పట్టరాని ఆనందముతో ఉట్టిపడి కంటి ధారలు కార్చాడు. ఈ లేతహృదయులైన పిల్లలలో యింతటి త్యాగమా, ఇంతటి ఔదార్యమా, ఇంతటి పవిత్రమైన భావమా అని ఆనందించాడు. 'నాయనా! ఆలస్యము చేయనక్కరలేదు. విషముతో నింపిన బంగారు పాత్రకంటె అమృతముతో నింపిన మట్టి పాత్ర మేలు. ఈ దేహము మృణ్మయము. మానవుని దేహము మట్టిపాత్ర. కానీ, శీలము, పవిత్రము అనే అమృతము నింపాడు భగవంతుడు. కాబట్టి, అమృతముతో నింపిన మట్టిపాత్ర ఈ మానవ దేహము. దీనినే మీరు ఆహ్వానించండి. విషముతో కూడిన బంగారు పాత్రైనా మనకు అక్కరలేదు' అని వాల్మీకి బాలురకు బోధించాడు. ఇక్కడ బంగారు పాత్ర ఏమిటి, విషపాత్ర ఏమిటి? ప్రపంచము సర్వసుఖములతో, సర్వ ఆనందములతో తులతూగుతున్న బంగారు పాత్రవలె కనిపిస్తుంది. దీని నిండుకు విషమే. ఇదియా మనకు బంగారము? హృదయస్థాయియే భగవంతుడు. భగవంతుడు బదరీనాథ్ యందో, కేదార్‌నాథ్‌యందో, భద్రాచలమునందో, ప్రశాంతినిలయమందో లేడు. అన్నింటికినీ కంట్రోలరు మన హృదయములో ఉంటున్నాడు. భగవంతుడు హృదయవాసి. ఎక్కడో వెతకనక్కరలేదు. ప్రతి ఒక్కరి హృదయమందు

ఉన్నాడు భగవంతుడు. కాబట్టి, మట్టిపాత్ర అయినా మానవ దేహము పవిత్రమైనది. దీనికి మానవమానములు, గౌరవమర్యాదలు అక్కరలేదు. భగవదానందము అనుభవించే నిమిత్తమై ఈ గౌరవము మనకెందుకు? మీరు త్యాగులై వెళ్లండి' అన్నాడు వాల్మీకి. నిముషములో వారు లోపలికి వెళ్లి కాషాయ వస్త్రములు ధరించి రుద్రాక్షలు కంకణములుగా ధరించారు. తంబుర పట్టుకొని బయలుదేరారు. 'రామకథను వినరయ్య' బజారు బజారు తిరుగుతున్నారు. రాకథను వినండి అని వినిపిస్తున్నారు. ఈ చిన్న వయస్సునందు ఈ దేహానికి యింత త్యాగమా! ఈ జీవితమునకు యింత విరక్తియా! లేదు వాల్మీకి ఆదర్శ యువకులుగా రూపొందింప చేశాడు.

*నీతిలేని యువత బలహీనులు*

ఈనాటి యువకులకు పబ్లిక్‌లో రెండు చేతులూ జోడించి నమస్కారము చేయాలంటే అభిమానము. నగర సంకీర్తనకు పోవాలంటే తలలు దాచుకొని పోతుంటారు. నొసట విభూతి యింట్లో పెట్టుకుంటారు. బయటకు వస్తే తుడిచివేసుకుంటారు. ఎంత విచిత్రమైన జీవితము. ఎంత దుర్బలమైన జీవితము. దేశానికి మనము భయపడటమా? పరులకు మనము భయపడటమా? మంచి కార్యమునకు ఎందుకు భయపడాలి? నీవు తప్పు చేయటం లేదు కదా. ఏ దోషములోనూ ప్రవేశించటం లేదుకదా. భగవన్నామస్మరణకు నీవు ఎందుకు భయపడాలి? దీనివల్లనే మానవత్వము బలహీనతపొందిపోతున్నాది. కనుక, మనము బలహీనులు కారాదు. బలహీనులు ఏ చిన్న కార్యము చేయలేరు. దుర్మార్గమునకు, దురాలోచనలకు, దుష్టవాక్యములకు మనము ముందంజ వేస్తున్నాము. పవిత్రమైన జీవితమునకు ఎందుకు వెనుకంజ వేయటం? ఇది ఈనాటి మానవుని గొప్ప బలహీనత. దైవము పేరు చెబితే ఏమి దోషము? తుచ్ఛమైన సినిమా పాటలు పాడతావే, దైవనామము పాడటంలో ఏమి అవమానము? అర్థరహితమైన పాటలలో నీ జీవితమును వ్యర్థము చేసుకుంటున్నావు. రామ, కృష్ణ, గోవింద అని చెప్పటములో ఏమి అవమానము? బజార్లో పోయి డడడా…అర్థరహితమైన పాటలలో గొప్పముందంజ వేస్తుంటారు. ఇది మానవునికే అవమానకరమైనది. మానవులు ఏమైనా పాడుకోవచ్చుగానీ మానవ జీవితము గడిపే ప్రతి వ్యక్తి ఈవిధమైన జీవితము గడపటము వ్యర్థము. మన జీవితములో కీర్తిని సంపాయించాలి. సమాజములో పేరు ప్రతిష్టలు ,సంపాయించుకోటానికి వినయ విధేయతలు ప్రధానము.

*జాతి గౌరవంబు నీతిపై నిలుచును*
*నీతిలేకయున్న జాతి చెడును*
*నీతి కల్గు జాతి నిజమైన జాతిరా*
*వినుము భారతీయ వీరసుతుడ!*

నీతి లేక జాతి ఎక్కడుంది? కుక్కలకు నక్కలకు ఒక సీజను, రీజను ఉంటున్నాది. మనిషియందు no reason, no season.

ఇలాంటి మనిషి మనిషి ఎట్లా అవుతాడు?

యువకులారా! మీరు మానవులు. దైవముయొక్క బిడ్డలు. దైవముయొక్క ప్రతిబింబములు. మీరంతా నా అంశమువారే, నా స్వరూపమే అని భగవంతుడు చెబుతున్నాడు. అలాంటి దైవస్వరూపులై మీరు ఎందుకు భయపడాలి? దైవనామము చెప్పటానికి ఎందుకు సిగ్గుపడాలి? దైవము చరిత్ర పరులకు బోధించుటకు ఎందుకు వెనుకంజ వేయాలి? ఇది వద్దు. ధైర్యముతో దైవసేవలో మీరు పాల్గొనండి. మీరు పవిత్రులగుటయేగాక తోటి మానవులను పవిత్రులను గావించండి. ఎక్కడికి పోతున్నావని ఎవరైనా అడిగితే తిరుపతికో, పుట్టపర్తికో పోతున్నానని చెప్పటానికి సిగ్గుపడతారు. బెంగుళూరు పోతున్నామండి అంటారు. ఎంత బలహీనులు. ఎందుకీ చిన్నదానికి అబద్ధమాడాలి? నేను పుట్టపర్తి పోతున్నాను. నేను స్వామిని దర్శించుటకు పోతున్నాను అని చెబితే ఏమి నీకు అవమానము?

ధైర్యముతో మనము దైవసేవలో పాల్గొనాలి. ఈవిధమైన ధైర్యము సాధించుకొని సమాజములో మీరు ప్రవేశించాలి. ధైర్యసాహసములతో మీరు సేవలలో ప్రవేశించాలి. ఏమి సేవ, ఎట్టి సేవ అనే విచారమే మనకు అక్కరలేదు.

*గ్రామసేవ సాయిసేవ*

ఈనాడు గ్రామములలో అశుభ్రతచేత, సరైన ఆహారము లేకపోవుటచేత, సరైన నీరు లేక అనేక రోగములకు గురౌతున్నారు. ఎక్కడ చూచినా కాలుష్యము. అలాంటి గ్రామాలలో ప్రవేశించినప్పుడు మొట్టమొదట సేవ చేయాలి. ప్రతి వారము అదే గ్రామము మీరు పోనక్కరలేదు. సేవలు చేయటంలో మీకు ధనము వ్యయమవుతుంది . మీరు ఉద్యోగములు చేసేవారు ప్రతి పర్యాయము లీవు తీసుకుంటే ఉద్యోగము ఊడిపోతుంది. కనుక, ఏవింధంగా మీరు చేయాలి? ఒక గ్రామము పోయినప్పుడు ఆ గ్రామములోని యువకులను మీరు ప్రోగుచేసి ఆ యువకులకు మీరు చక్కగా బోధించి, 'అయ్యా! మన గ్రామము మనం శుభ్రము చేసుకోకపోతే యింక ఎవరు చేస్తారు?' ప్రతి వారము మీటింగు పెట్టుకొని ఆ గ్రామములోని యువకులే ఆ ఊరిలో సేవలు చేయటానికి తగిన కృషి చేయాలి. ఎక్కడో హైదరాబాద్ నుండి నెల్లూరు పోవటము ఎంత కష్టము. నెల్లూరులోని యువకులనే తీసుకొని ఆ నెల్లూరు యువకులకు ట్రైనింగు అందించాలి. ఇంకో గ్రామము పోతే ఆ గ్రామము యువకులకు తగిన బోధలు సల్పి వారితో సేవలు చేయించాలి. అప్పుడు మీకు ధనము వ్యయము కాదు, కాలము వ్యర్థము కాదు. ఈవిధంగా ప్రతి గ్రామమందు సేవలలో పాల్గొనాలి. కొన్ని మెడికల్ క్యాంప్స్ పెట్టుకోవాలి. ఎందుకంటే ఆరోగ్యమే మహాభాగ్యము. ఆరోగ్యము లేక ఏ పనీ చేయలేము. ఆరోగ్యమునకు సంబంధించిన ప్రధానమైన ఏర్పాట్లు మనం చేయాలి. ఒకరిద్దరు డాక్టర్లను తీసుకుపోయి medical checkup చేయించాలి. ఈవిధంగా యీనాటి యువకులు సర్వసంగ పరిత్యాగులై పల్లెలందు సేవలు చేస్తున్నారంటే పల్లె వారికి కూడా సిగ్గువేసి వారే యిందులో పాల్గొంటారు. మనము ఎప్పుడూ సేవకులు, సేవకులు, సేవకులు కావాలి. సేవకత్వములోనే నాయకత్వము ఉంటున్నాది. ఈనాటి లోకములో నాయకులు ఏనాడూ సేవలు చేసినవారు కాదు సేవలు చేయక నాయకులు కావాలని ఆశిస్తున్నారు. అందువలనే లోకమునకు ఈ గతి పట్టిపోతున్నాది. సేవకత్వములోనే గౌరవముంటున్నాది.

హనుమంతుడు ఎట్టివాడో మీకు తెలుసునా? హనుమంతుడు శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు. అతను అశోక వనములో చేరాడు సీతాన్వేణ నిమిత్తమై. అనేక పవిత్ర కర్మలాచరించాడు. కానీ, లంకలోని రాక్షసులు ఏనాడూ కోతి ముఖము చూచి ఉండలేదు. కొత్త రకమైన జంతువు వచ్చిందని అందరూ బయలుదేరారు చూడటానికని. అందులో రావణుని కుమారుడు ఇంద్రజిత్ , 'నీవు ఎవరు? ' అని ప్రశ్నించాడు. హనుమంతుని శక్తిసామర్థ్యములు ఎవరికి తెలియవు. అయినా చెప్పాడు, 'దాసోహం కోసలేంద్రస్య' అయ్యా! నేను శ్రీరామచంద్రుని దాసుడను' అన్నాడు. దాసత్వములో ఎంతో గౌరవము యేర్పడింది అతనికి. నేను శ్రీరామచంద్రుని దాసుడను అనుకుంటే మనకే గౌరవము, యింకొకరికి కాదు. ఒకరు ఇంకొకరికి దాసులు కావచ్చు. దుష్టకర్మలకు, దురాలోచనలకు దాసుడు కావచ్చు. విషయభోగములకు, విషయానందములకు దాసుడు కావచ్చు. దేవునికి దాసుడు కావటంలో తప్పేముంది. ఈవిధమైన విచారణ మనం చేస్తూ రావాలి. నేను ఏమి తప్పు చేస్తున్నాను, నేను ఎందుకోసం భయపడాలి? సమాజ సేవ చేయటంలో తప్పేముంది?

*సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం*

ఈవిధంగా తనలోతాను ధైర్యమును, సాహసమును అభివృద్ధి పరచుకోవాలి. మొట్టమొదట ధైర్యసాహసములు రావాలి. ఈవిధంగా సేవలో పాల్గొన్నప్పుడు దైవము మీ సన్నిధియందే ఉంటాడు. వేరే సాధనలు చేయనక్కరలేదు. సమయం చిక్కుతే ధ్యానము, జపము చేయి. ఈ మోడరన్ యేజ్‌లో ధ్యానము, జపము చేయటము కష్టము. కూర్చుంటాడు ధ్యానమునకు, మంచి ఫోటో కోసం కూర్చున్నట్లు. మైండ్ మార్కెట్టు అంతా తిరుగుతుంది. ఈ

ధ్యానము నీకు అక్కరలేదు. నీవు నోరు మూయి, హృదయము తెరు. అదే నిజమైన ధ్యానము. ఈనాడు హృదయము మూసుకొని నోరు తెరుచుకుంటున్నారు. ఇది ధ్యానమే కాదు. జపం చేస్తుంటారు, చేతిలో జపమాల తిరుగుతుంటుంది, మైండ్ చాకలింటికి, మంగలింటికి ప్రయాణమౌతుంది. ఇది కాదు జపము. ఈవిధంగా కాలము వ్యర్థము చేయవద్దు. జపము చేయటానికి, ధ్యానము చేయటానికి కుదరకపోతే సేవ చేయి. మరొక రీతిగా మీరు విచారణ చేయాలి. దైవమును ఏరీతిగా మనం ప్రార్థించాలి అని కొంతమందికి సందేహము. నీవే దైవమై ఉండగా నీవు ప్రార్థించుట ఏమిటి? అయితే నేనే దైవము అనే సత్యము నీవు గుర్తించే వరకు కొన్ని రకములైన సత్కర్మలు ఆచరించాలి. అప్పుడు నేను చేసే ప్రతి కర్మ భగవంతునికి అర్పితము గావిస్తున్నాననే భావముతో చేయి. దీనినే భారతీయులు 'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అన్నారు. ఏమిచేసినా భగవత్కర్మగా మనం విచారం చేయాలి. ఆవిధముగా చేసినప్పుడు అన్ని కర్మలూ భగవత్కర్మలుగా రూపొందుతాయి. ప్రారంభములో కొంచెము శ్రమ కలగవచ్చు. కొన్ని బాధలు కలగవచ్చు. కానీ, క్రమక్రమేణా అదే సాధనగా రూపొందుతుంది. ప్రతి ఒక్కటీ అభ్యాసముతోనే సాధించాలి. ఒక పాట పాడాలంటే అప్పటికప్పుడు పాడలేవు. అభ్యాసము చేయాలి. నడచుటకు అప్పటికప్పుడు వీలుకాదు. కొంచెము తప్పటడుగులు వేసి తిరిగి నడవాలి. eating, talking, reading ప్రాక్టీసే. అదే రీతిగా service కూడా ఒక ప్రాక్టీసుగా తీసుకోవాలి. భగవచ్చింతన ఒక ప్రాక్టీసుగా తీసుకోవాలి. ఆవిధముగా తీసుకొని కట్టకడపటికి భగవత్ప్రీత్యర్థం చేయలి.

*జంతూనాం నరజన్మ దుర్లభం*

ఒక పిల్లవాడు, 'స్వామీ! మాకు శక్తినివ్వండి' అని అడిగాడు. ఏమి శక్తి కావాలి? సినీమా చూడటానికి శక్తి కావాలా? టి.వీ. చూడటానికి శక్తి కావాలా? వీడియో చూడటానికి శక్తి కావాలా? ఏ శక్తి కావాలి నీకు? కావలసినంత శక్తి ఉంటున్నాది ఈనాటి యువకులలో. మూడువంతులు శక్తి వేస్టు చేస్తున్నారు. కానీ, మీకు వేస్టు టేస్టుగా ఉంటున్నాది. కాదుకాదు. అది చాలా తప్పు. మనలోనున్న శక్తి దేనికీ లేదు. 'ప్రపంచములో దేనికి విలువ?' అని ప్రశ్నించినప్పుడు బంగారమునకు విలువ, డైమండ్‌కు విలువ, భూమికి విలువ అని చెబుతారు. సరైన రీతిగా విచారణ చేస్తే మనిషికే విలువ. man is more valuable than all the wealth of the world. డైమండ్‌ను కొనేది ఎవరు? మనిషే కొంటున్నాడు. బంగారము కొనేది ఎవరు? మనిషే కొంటున్నాడు. అది కొనబడేదేగాని కొనేది మనిషే. కొనేవాడు లేక కొబడే దానికి విలువ లేదు. కానీ, ఆ శక్తి నాకున్నదనే విశ్వాసము మీరుపెంచుకోవాలి. జంతూనాం నరజన్మ దుర్లభం. దుర్లభమైన నరజన్మ ఎత్తినాము. మానవజన్మ సార్థకము గావించుకొని సత్కర్మలలో మనం ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈ మానవత్వమునకు ఒక విలువ ఏర్పడుతుంది. ఒకానొక సమయంలో సేవలు చేయకుండా కేవలం రాంరాంరాం అని రామచింతన చేస్తూపోతే ప్రయోజనం లేదు.

*మానవతా విలువలు మన జీవిత వెలుగులు*

సీతాన్వేషణలో హనుమంతుడు లంకలో ప్రవేశించాడు. లంకలో విభీషణునికి హనుమంతునికి స్నేహము యేర్పడింది. విభీషణుడు హనుమంతుని ముందు బాధపడ్డాడు. 'హనుమా! నీవు రామ సన్నిధి చేరుకున్నావు. రామచింతన చేస్తున్నావు. నీ రోమరోమములు రామనామముతో కూడి ఉంటున్నాయి. నీవు ఎంత అదృష్టవంతుడివయ్యా! నేను ఎన్నో సంవత్సరముల నుండి రామనామము స్మరిస్తున్నాను. కానీ, రామ దర్శనము లభించలేదన్నాడు. హనుమంతుడు చెబుతున్నాడు, ' విభీషణా! రాంరాం అని టేపురికార్డు మాదిరి చెబుతున్నావు. కానీ రామ సేవలో యేమైనా పాల్గొన్నావా? పదినెలలైపోయింది సీతామ్మవారు ఈ లంకకు వచ్చి. ఒక్కసారి ఏమైనా ఆమెను చూచావా? ఆమె బంధ విమోచనకు యేమైనా ప్రయత్నించావా? ఇది రామకార్యము కాదా? రామకార్యము చేయకుండా రామనామము చేస్తుంటే ఎట్లా రామతత్త్వము పొందగలవు? కనుక, రామనామముతోబాటు సేవకూడా ఉంటుండాలి.

నామము నెగిటివ్, సేవ పోజిటివ్. నెగిటివ్, పోజిటివ్ రెండూ చేరినప్పుడే కరెంటు ఉపయోగపడుతుంది. అదే మన విల్‌పవర్.ఆ విల్‌పవర్ మనం చక్కగా ఉపయోగించుకోవాలి. ఇప్పుడు ఈ బల్బు వెలుగుతున్నాది. ఇక్కడ వెలుగు రావాలంచే ఏది ఆధారము? దీనికి బల్బు ఆధారము. బల్బుకు కరెంటు పోవాలంటే ఏది ఆధారము? వైరు ఆధారము. వైరుండినంత మాత్రమున బల్బు వెలుగు యిస్తుందా? అందులో కరెంటు కూడా ఉండాలి. సత్యమనే కరెంటు ధర్మమనే వైరులో చేరి శాంతి అనే బల్బులో ప్రవేశించి ప్రేమ అనే వెలుగు మనకు వస్తుంది. అదే ప్రెమ. ఆ ప్రేమ అనే ప్రకాశము మనలో ఆవిర్భవిస్తుంది. సత్యధర్మశాంతిప్రేమలు మన జీవితమునకు వెలుగునందిస్తున్నవి.

*ఇంద్రియనిగ్రహం..దైవచింతన*

యువకులారా! యువతులారా!

ఒక దీపము వెలిగించాలంటే తైలము కావాలి. తైలము దీపమును వెలిగిస్తుంది. భగవంతుని ప్రేమ జీవితమునే వెలిగిస్తుంది. కేవలము ప్రాకృతమైన ప్రేమ కాదు. దివ్యమైన ప్రేమ మన జీవితమును వెలిగింప చేస్తుంది. కానీ, దివ్యప్రేమ అంటే యేమిటో, ప్రాకృతప్రేమ అంటే యేమిటో అర్థము చేసుకోలేకపోతున్నారు. పవిత్రమైన దైవప్రేమకు హద్దులు లేవు. ఇట్లా ఉండాలి అట్లా ఉండాలి అని ఎవరూ శాసించేవారు లేరు. భగవంతుని ప్రేమ అన్ని మార్గములందు ప్రవేశిస్తుంది. కానీ, ప్రాకృత ప్రేమకు కొన్ని పరిమితములు చేరి ఉంటున్నాయి. పరిమిత ప్రేమను పరిమితమైనదానిలోనే ప్రవేశపెట్టాలి. సత్యాన్వేషణ. నిన్న చెప్పాను. సత్యానికి అన్వేషణ ఎందుకని. మరొతూరి జ్ఞాపకము చేస్తున్నాను. కన్నులతోనే భార్యను, బిడ్డను, తల్లిని చూచారు. చూచిన కన్నులు ఒక్కటే. అయినా ఎవరిని ఏవిధంగా చూడాలి అని discrimination చేయాలి. తల్లిని గౌరవముగా మాతృభక్తితో , ఆదృష్టితో చూడాలి. ఆమె మాతృదేవి. దేవితో సమానంగా చూడాలి. తల్లికి ఆనందము చేకూరుస్తుంది. భార్యను మోహముతో చూడాలి. బిడ్డను వాత్సల్యముతో చూడాలి. వాత్సల్యము బిడ్డకు ఆనందమునిస్తుంది. కనుక, ఈనాడు దృష్టిని మీరు కంట్రోలు చేసుకోవాలి. మీరు వేరుగా భావించకండి. ఈనాడు కొన్నిరకములైనవి ఏవిధంగా ప్రారంభమౌతున్నాయి? మీరు కాలేజీకి పోతున్నారు. కాలేజీలో కోఎడ్యుకోషన్ ఉంటున్నాది. స్త్రీలు, పురుషులు ఇద్దరూ ఉంటారు. చేరటం తప్పు కాదు. కానీ, ఎప్పుడది తప్పు కాదు. ఇరువురూ ఇంద్రియములను నిగ్రహించుకున్నప్పుడు అది తప్పు కాదు. కానీ, ఈనాడు మన యింద్రియములు breakless car గా ఉంటున్నాయి. అలాంటి సమయంలో ఈ కోఎడ్యుకోషన్‌లో మనం చేరకూడదు. ఏదో ఒక సమయంలో మన దృష్టి ప్రసరిస్తుంది. మొట్టమొదట చూపుతో ప్రారంభమౌతుంది. చూపుతో ప్రారంభమైంది నవ్వులతో అభివృద్ధి అవుతుంది. నవ్వులతో అభివృద్ధి అయి మాట్లాడటములో enter అవుతుంది. తరువాత writing ప్రారంభమౌతుంది. తరువాత friedship ప్రారంభమౌతుంది. చివర relationship గా మారిపోతుంది. ఈ relationship కి కారణం ఏది? చూపే.

అందువలనే సూరదాస్ చెప్పాడు, 'కన్నులుండి గుడ్డులై కల్యాణకరమైన నీ రూపు దర్శింప నేరరైరి' భగవంతుడా అందరికీ కన్నులుంటున్నాయి. కానీ, ఆకన్నులతో నిన్ను చూడగలుగుతున్నారా? వికారములంతా చూడగలుగుతున్నారు. సంకుచిత దృష్టితో నున్నారు. నీ దృశ్యమును చూచే కన్నులే నా కన్నులు. చెవులున్నాయి. ఈ చెవులు ఊరివారి సుద్దులంతా వింటున్నాయిగానీ దైవ చరిత్ర వినటానికి ప్రయత్నించటం లేదు. మన చెవులు ఏవింధంగా ఉండాలి? మంచి శ్రవణము చేయాలి. పవిత్రమైన భావములు వినాలి. ప్రపంచముయొక్క సందేశము చక్కనైన రీతిగా, శుభమైన రీతిగా, మంగళకరమైన రీతిగా నడిచే విషయాలు మనం వినాలి. ఇవి వినటానికి చెవులిచ్చాడుగానీ ఊరివారి సుద్దులు వినటానికి కాదు. మన ఇంద్రియములు చక్కగా నిగ్రహించుకోవాలి. అప్పుడే ఈ భావము చక్కబడుతుంది.

అందువల్లనే జయదేవుడు చెప్పాడు. జయదేవుడు చాలా ఇంద్రియనిగ్రహము కలవాడు. కృష్ణ చింత తప్ప

అన్య చింత లేదు. తాను నాలుకకు చెబుతున్నాడు బుద్ధి.

*జిహ్వే రసజ్ఞే మధుర ప్రియే త్వం సత్యం హితంతే పరమం వదామి*
*ఆవర్తయ త్వం మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.*

ఓ రసమెరిగిన నాలుకా! ఓ పవిత్రమైన నాలుకా! ఆశ్చర్యకరమైన నాలుకా! ఓ అద్భుతమైన నాలుకా! నీకు చక్కని మధురమైన మాటలు చెబుతున్నాను. నాలుక చేసే పాపములు నాలుగున్నాయి. నీవు మొట్టమొదట అసత్యము చెప్పవద్దు. ఇంకొకరిని ద్వేషముగా ద్వేషము మాటలు ఉపయోగపెట్ట వద్దు. నాల్గవది అధికముగా మాట్లాడ వద్దు. ఈ నాలుగు పాపములచేత నీవు మహాపాపివి అయిపోయినావు. ఈ సర్వ పాపములు పరిహారము చేసుకునే నిమిత్తమై గోవింద, దామోదర, మాధవ అని నామస్మరణ చేయి.

*నగరసంకీర్తన చేయండి*

తెల్లవారుఝామున నగర సంకీర్తన ఎందుకోసం పెట్టాము? ఏ పని లేక పెట్టామా? early morning లేచి నిద్ర పాడుచేసుకోమని పెట్టామా? కాదు కాదు. ఇది భౌతికంగా, లౌకికంగా, ఆధ్యాత్మికముగా ఎంతో పవిత్రమైనది. బ్రహ్మముహుర్త కాలము. చల్లని ప్రదేశము. చల్లని వాతావరణము. ఆ చల్లని వాతావరణములో మన మనస్సు రాత్రంతా నిద్రించి మంచి ప్రశాంతముగా ఉంటుంది. లేచిన తక్షణమే పిచ్చి పిచ్చి పలుకులు వికుండా అసభ్యమైన శ్రవణం చేయకుండా రామా, కృష్ణా, గోవిందా అని నామస్మరణ వింటుంటే హృదయమునకెంతో హాయి చేకూరుస్తుంది. వినేవానికి హాయి. తెల్లవారి లేస్తూనే భగవన్నామము విన్నాను అనుకుంటాడు. తెల్లవారి లేచిన తక్షణమే భగవన్నామ స్మరణ చెయ్యాలి. మొట్టమొదట లేచిన తక్షణమే స్మరణతో ప్రారంభము కావాలి. అందునిమిత్తమై సత్యసాయి సంస్థలలో నగరసంకీర్తనలు, భజనలు, సత్సంగములు, స్టడీసర్కిల్సు పెట్టాము. ఇవన్నీ పెట్టటానికి కారణం ఏమిటి? ఇవంతా కాలము పవిత్రము చేసి హృదయమునకు శాంతి చేకూర్చటానికే. శాంతి ఎక్కడుంది? భౌతికముగా చూస్తే శాంతి గాఢనిద్రలో ఉంది. లభిస్తుంది. రెండవది సంకల్పరహితుడైనప్పుడు శాంతి పొందుతున్నావు. సంకల్పములను అరికట్టుకొనపటకు వీలు కాదు. కనుక, మనము సాధ్యమైనంతవరకు ఒక గంట మౌనము వహించాలి. మాట్లాడి మాట్లాడి తలలోని నరములు బలహీనమైపోతాయి. మాటలలో పవిత్రమైన మాటలైతే బ్యాటరీ ఛార్జి అవుతుంది. అపవిత్రమైన పరనిందలుగానీ, పరదూషణగానీ మనము పలుకుతుంటే మన జీవితము మరింత అధోగతి పాలైపోతుంది. కనుక, ఈనాటి యువకులంతా మొట్టమొదట మాటలు తగ్గించుకోవాలి. అందులోనున్న మాధుర్యము మీరు ఎంతో అనుభవించగలరు. సమాజముకూడా చూస్తే ఆ పిల్లవాడు చాలా మంచివాడు, ఎవరితోనూ మాట్లాడడు. quite గా ఉంటాడనే సత్కీర్తిని పొందుతాడు. కొంతమంది వడవడ వాగుతుంటారు. వీరిని చూస్తే సమాజములో వస్తున్నాడురా వాయారి అని వెళ్లిపోతారు. బోర్‌గా ఉండేవాడు వస్తున్నాడని తప్పించుకు పోతారు. నిన్ను తప్పించుకు పోవటమేకాక నీకు చెడ్డ పేరు వస్తుంది. మితభాష అతి హాయి. అతి భాష మతి హాని.

*శీలం, ప్రవర్తన, నడతలు చాలా ముఖ్యం*

సేవ చేసేదానిలో ఎక్కువ ధనము వ్యయము చేయనక్కరలేదు. సాధ్యమైనంత వరకు తక్కువగా ఖర్చుపెట్టుకొని సేవలు అధికముగా చేయాలి. మీరు లక్షాధికారులు కావచ్చు. శ్రీమంతులు కావచ్చు. కానీ, simple living, high thinking మీరు వేసే డ్రస్సులు కూడా simple గా వుండాలి. ఆడంబరమునకు పోకూడదు. ఆడంబరముగా పోయినప్పుడు అహంకారము బయలుదేరుతుంది. కనుక, మనము simple dress, simple life, simple living గా వుండాలి. పరిశుద్ధమైనదిగా వుండాలి. ఆరోగ్యమును కూడా కాపాడుకోవాలి. సమాజములో గౌరవము పొందాలి. దానికి తగిన డ్రస్సు మనం వేసుకోవాలి. దానితోపాటు మన ప్రవర్తన పవిత్రమైనదిగా వుండాలి. మనము వేసుకున్న డ్రస్సు ఎంత తెల్లగా, ఎంత పరిశుద్ధముగా

వుంటున్నదో మన హృదయము కూడా అంత పరిశుద్ధముగా వుండాలి.

మొట్టమొదట మనము మనలను తెలుసుకోటానికి ప్రయత్నించాలి. ఎక్కడ చూచినా 'who are you?' అని ప్రశ్న వేసేటప్పటికి చాలా కాలము వ్యర్థమైపోతుంది. మొట్టమొదట నిన్ను నీవు తెలుసుకొనుటకు ప్రయత్నము చేయాలి. ఎట్లు తెలుసుకొనుటకు ప్రయత్నము చేయాలి? ఈ జగత్తులో అంతా అశాంతితో బాధపడుతున్నారు. వాతావరణము మానవుని చాలా బాధింపచేస్తున్నాది. హిల్‌స్టేషన్‌కి వెళ్లి ఏమి చేస్తారు? లోపల బనీను వేసుకుంటారు. పైన షర్టు వేసుకుంటారు. దానిపై వులెన్ కోటు వేసుకుంటారు. దేనికోసం? ఆ చల్లదనము భరించేకోసము వేసుకుంటారు. అయితే తిరిగి మన స్వస్థానమునకు వచ్చినప్పుడు యేమి చేస్తాము? మొట్టమొదట పైనున్న వులెన్‌కోటు తీసివేస్తాము. తరువాత షర్టు తీసివేస్తాము. బనీనుకూడా తీసివేస్తాము. అప్పుడు మన ఛాతీని చక్కగా చూచుకోగలము. పైనున్న కోటే తమోగుణము, లోపలున్న షర్టే రజోగుణము, బనీనే సాత్వికము. ఈ మూడింటిని తీసివేసినప్పుడు ఆత్మ తత్త్వము నీకు అర్థమవుతుంది. ఈ త్రిగుణములుండినంత వరకు మనకు ఆత్మజ్ఞానము అర్థము కానేకాదు. మనము క్రమక్రమేణా ఈ గుణములను తగ్గించుకుంటూ పోవాలి.

యువకులారా! మొట్టమొదట చెప్పినట్టుగా అన్నింటికీ మూలము శీలము. మన శీలము, మన ప్రవర్తన, మన నడత చక్కగా ఉంటుంటే మనకంటె మించినవారు చరిత్రలో మరొకరు ఉండరు. మీరు పదిమంది ఒక గ్రామము వెడతారు. ఆ గ్రామములో మీరు ఎట్లా ఉండాలి? ప్రశాంతముగా ఉంటుండాలి. చిరునవ్వుతో ఉంటుండాలి. అంతేగానీ హహహా అని నవ్వుకుంటూ పోకూడదు. బయటి వారికి అశాంతినిచ్చేటట్టు గట్టిగా మాట్లాడుకుంటూ పోకూడదు. ఏమిరా రౌడీగ్యాంగు వస్తుందని గ్రామస్తులు కూడా భయపడిపోతారు. అలాంటి చెడ్డ పేరుకు గురి కాకూడదు. వినయంగా వెళ్లాలి. చూపులుగానీ, మాటలుగానీ అపవిత్రముగా ప్రవేశపెట్టకూడదు. పనిలో ప్రవేశించండి. పనిలో ప్రవేశిస్తే మాటలకు అవకాశము ఉండదు. మాట్లాడేవాడు పని చేయడు. పనిచేసేవాడు మాట్లాడడు. ఈ సత్యము మీరు జ్ఞాపకము పెట్టుకోండి. నిజంగా మాట్లాడేవాడు పని చేయడు. జీవితములో ఎలా నడచుకోవాలన్నది కొత్త chapter గా తీసుకోండి.

*విశ్వాసంతో వర్తమానంలో వర్తించు*

జరిగిపోయింది జరిగిపోయింది. మీరు ఎంత ప్రయత్నము చేసినా రాదు. future గురించి యోచన చేయకండి. future is not sure.present చాలా important. this is not ordinary present, omni present. ఎందువల్ల? మానవుడు ఈనాడు అనేక దుఃఖములకు, అశాంతికి గురికావటానికి కారణం ఏమిటి? present ను మరచి future ను వెతుక్కుంటున్నాడు. present ప్రధానం. ఆకలైనప్పుడు తట్టలోని అన్నం భుజించు. పది నెలల క్రిందట మా యింట్లో పండగ జరిగింది. ఆ పండగలో పంచభక్ష్య పరమాన్నములు చేశామని తలచుకొని ప్రయోజనం ఏమిటి? పదినెలల ముందు జరిగింది ఎందుకు యోచించాలి? present ని యోచించు. past --tree, future-- tree, present--seed. past tree నుంచి present seed వచ్చింది. present seed నుండి fututre tree వస్తుంది. seed is very very very important. present లో తగిన జాగ్రత్తగా ఉండాలి. fututre గురించి ఏమాత్రం తలచకండి. present లో మనం మంచిగా ఉంటే fututre లో ఆటోమేటిక్‌గా మంచిగా ఉంటుంది. కనుక, fututre ను గురించి చింతిస్తే సైకలాజికల్‌గా నిజంగా దుఃఖమే ఏర్పడుతుంది. చింతనే చేయకు. ఎందుకు చింత చేయాలి? what is the shape of worry? it is mentally created fear only.

ఈ worry కి ఏ రూపూ లేదు. నీ క్రియేషన్. అలాంటి దీనికి అవకాశము యివ్వకండి. ఈవిధంగా ఉంటుండి ఎప్పుడూ ఆనందముగా ఉండండి. 'మా కెట్లా స్వామీ! ఇంటిలో అనేక చిక్కులుంటాయి, మాకు అనేక బాధలుంటాయి, సంసారములో వ్యధలుంటున్నాయి. మేము ఎట్లా సుఖముగా ఉండటానికి వీలవుతుంది?' అంటారు. worry చేస్తే problems పోతున్నాయా? పోవటం లేదే! కనుక, worry చేసి ఏమి ప్రయోజనం? కనుక, హేపీగా ఉండు. happiness నీ worry ని దూరం చేస్తుంది. అంతేగానీ worry గా ఉంటే ప్లస్ ప్లస్ అయిపోతుంది. ఏది వచ్చినా యిది భగవత్ప్రసాదం, కష్టములుకూడా భగవత్ప్రసాదమే! pleasure is an interval between two pains. రెండు కష్టముల మధ్యనే సుఖము ఉంటున్నాది. కష్టములు లేక సుఖము విలువ మనకు తెలియదు. చీకటి లేక వెలుగుయొక్క ప్రకాశము తెలియదు. కాబట్టి, కష్టములు కూడా ప్రసాదమే. మలేరియా జ్వరము వచ్చిన వానికి క్వినైన్ యిస్తారు. bitter గా ఉంటుందిగానీ దానిని నీవు కష్టపడి త్రాగినప్పుడే మలేరియా జ్వరము నివారణమైపోతుంది. మందు కూడా తీయగా కావాలని కోరితే వ్యాధి నివారణ కాదు. కష్టము కూడా సుఖమునందిస్తుంది. ఎప్పుడూ నీవు joyful గా ఉండాలి. అప్పుడే నీ జీవితము ఆనందము, ఆదర్శము అందిస్తుంది.

యువతీయువకులారా! శరీర సంబంధమైన విషయములుగానీ, fututre విషయములుగానీ, కుటుంబ విషయములుగానీ మీరు హృదయములో యేమాత్రమూ చోటివ్వకండి. హృదయములో చోటు యివ్వవలసింది ఒక్కనికే. భగవంతునికే యివ్వాలి. art అంతా outside ఉంది. heart inside ఉంది. art అంతా inside నుండి వచ్చినదే. కనుక, మొట్టమొదట heart ని చూచుకో. art ని చూడవద్దు. reflection of the innerbeing. లోపల నీవు ఆనందంగా ఉంటే బయట ఆనందమే వస్తుంది. ఎందుకోసం? భగవంతుడు నా వెంటనే ఉన్నాడు. హృదయమునందే ఉంటున్నాడనే విశ్వాసము మనము పెంచుకోవాలి. అప్పుడే తగిన ఉత్సాహప్రోత్సాహములు అభివృద్ధి అవుతుంటాయి.

కష్టనష్టాలు కదిలే మేఘాలే

ఇంకా కొంతమంది గేలి చేయవచ్చు. 'ఒరే! ఇంత చదువుకున్నావు. టౌన్‌లో వుంటున్నావు. టౌను వాతావరణము అనుభవించావు. పల్లెల వారివలె దేవుడు, భజన అని ఈరకంగా ఎందుకు పోతున్నావు? ఇదంతా మోడరన్ ఏజ్. దేవుడు, దైవము అని చింతించకూడదు'. కొంమంది నాస్తికులుంటారు కదా. అంటారు. దేన్ని చింతించాలి? దయ్యమును చింతించాలి. కాదుకాదు. దైవాన్ని చింతించాలి. నీ విశ్వాసము గాఢంగా ఉంటుండాలి. 'అయ్యా! నీవు ఎవరికి చెబుతున్నావు? నాకు చెబుతున్నావు. ఎవరు లేదని చెబుతున్నావు. దేవుడు లేదని చెబుతున్నావు. నీకు లేడుగానీ నాకున్నాడు. నా దేవుడు లేడని చెప్పటానికి నీవు ఎవరు? నీకు లేకుండాపోతే పోనీ. నాకున్నాడు. నా దేవుని నేను చింతిస్తున్నాను'. ఇటువంటి ధైర్యముతో ఎదుర్కొన్నప్పుడే నీ ధైర్యసైహసములు అభివృద్ధి అవుతాయి. అంతేగానీ నీకున్న దానిని లేదంటే నీవు ఎందుకు విశ్వసించాలి? ఒకడు వచ్చి, 'నీకు అమ్మ లేదంటే' అమ్మ లేదని ఏడ్వకూడదు. వాడు వట్టి అమాయకుడు.' నా తల్లి యింటిలో ఉంటున్నాది' అని ధైర్యముగా నీవు ఎట్లా చెప్పుకుంటున్నావో అదే రీతిగా 'నాకు దేవుడున్నాడు. నా దేవుడు హృదయములో ఉన్నాడు' అని ధైర్యముగా వానితో వాదించుటకు పూనుకోవాలి. వారిని నీతో ప్రవేశపెట్టుకోవాలి. కానీ నీవు వారితో ప్రవేశించకూడదు. నీవు వానిని ఫాలో చేస్తే స్లేవ్ అయిపోతావు. నీకందరూ స్లేవ్‌లు కావాలి. ఎందుకంటె నీవు దైవత్వముతో ఉన్నావు. దైవత్వముతో ఉన్న వారికి జగత్తంతా చేరిక అవుతుంది. ఇట్టి ధైర్యసాహసములను పెంచుకోవాలి. ఎవరో వచ్చి ఏమో అన్నారని ఏడ్చుకుంటూ కూర్చోకూడదు. ఈ ఏడ్పు ఆడవారికి సహజము. అవి washerless taps. ఎప్పుడూ కన్నులు నీరు కారుతూనే ఉంటాయి. అదికూడా మంచిది కాదు. దాన్ని మనము అరికట్టుకోవాలి. దేనికోసం కన్నీరునివ్వాలి? ఆధ్యాత్మికముగా కొన్ని అర్థములుంటున్నాయి. నారాయణుని కోసం కంటి ధారలు కార్చాలిగానీ మిగతా దానికి కంటి ధారలు

విడచకూడదు. ఏవో కష్టాలు, నష్టాలు వస్తుంటాయి. అవన్నీ passing clouds, passing clouds. permanent clouds లేవు ప్రపంచములో. అన్నీ కదలిపోయేవే. ఈ సత్యము మనము గుర్తించినప్పుడు విచారమునకు యేమాత్రమూ అవకాశము నందించరు. మన భక్తి శ్రద్ధలు అంత గాఢముగా భద్రమైపోవాలి. చలించని మనస్సు, భ్రమించని దృష్టి మనం పెట్టుకోవాలి. దృష్టిని యేమాత్రమూ మార్చుకోకూడదు. మన హృదయము యేమాత్రమూ అపవిత్రము గావించుకోకూడదు. స్థిరమైనదిగా ఉంటుండాలి.

దైవాన్ని మరువవద్దు, విమర్శించవద్దు

ఈ ప్రపంచములో యింతమంది యువకులుండినప్పటికీ ఈ కొద్దిమంది యువకులు మాత్రమే ప్రశాంతినిలయము చేరటంలో ఎంత అదృష్టవంతులో మీరు. మీకు లభించిన ఈ ప్రాప్తిని మీరు వ్యర్థము చేసుకోకండి. మీరు ఎక్కడికి పోయినా నేను వెంట ఉన్నాను. మీకు యేవిధమైన బాధలు వచ్చినా నేను చూచుకుంటాను. ధైర్యముతో దైవభావము మీరు అభివృద్ధి పరచుకొని సేవలలో పాల్గొనండి. నష్టములైనా సహించుకొని సేవలు మానకండి. వస్తుంటాయి, పోతుంటాయి. లాభనష్టమలు, సుఖదుఃఖములు వస్తుంటాయి, పోతుంటాయి. దీనికి మనము వెరువకూడదు. దైవచింతన చేస్తూ కూర్చోవాలి. మహా భక్తుడు త్యాగరాజు. కానీ, అతనికి చాలా కష్టములొచ్చాయి. ఎంతనో భరించుకునే త్యాగరాజుకూడా రామ వియోగము భరించుకోలేక బాధపడుతూ రాముని నిందిస్తూ వచ్చాడు. నిందించటమే కాక ఒకవిధమైన ద్వేషము వచ్చింది. ఈ ద్వేషముతో ఏమన్నాడు? 'రామా! నేను యిన్ని కష్టములు పడుతుంటే నీవు నివారణ చేయలేకపోతున్నావా? ఈ కష్టములు నివారణ చేసే శక్తి నీకు లేదా లేక నిన్ను కరగించే భక్తి నాకు లేదా? లేదులేదు నాకు భక్తి ఉంది. నీలో శక్తి లేద'న్నాడు. తక్షణమే మేలుకున్నాడు. 'ఛీ! ఛీ! దైవమునకు శక్తి లేదా? మనతో ఆడుతూ పాడుతూ ఆనందముగా తిరుగుతుంటే మానవ రూపంగా మనము భావిస్తున్నామే. భగవంతుని శక్తిసామర్థ్యములు చాలా గొప్పవి' అని విచారము చేశాడు. తిరిగి కన్నులు మూసుకున్నాడు. చేతులు కట్టుకున్నాడు. రామా!

కపి వారథి దాటునా కలికి రోటగట్టునా
లక్ష్మిదేవి వలచునా లక్ష్మణుండు కొలచునా
సూక్ష్మ బుద్ధిగల భరతుడు చూచిచూచి మొక్కునా
అబ్బ రామశక్తి ఎంతో గొప్పరా!

రామా! నీ శక్తి యింత అంత కాదు, ఎంతో గొప్పది. నా బుద్ధి చిన్నదైపోవటం చేత మందలించాను. నా తప్పే, తప్పే'. అదేవిధముగా మీలో యిలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు దైవమును నిందించకండి. దైవమును విస్మరించకండి. మిమ్మల్ని మీరు విచారించుకోండి. మిమ్మల్ని మీరు విమర్శించుకోండి. మీలో దోషములు మీరు చూచుకోండి. అప్పుడే మీరు బాగుపడతారు. కనుక, ఈనాడు విద్యలు నేర్చితిమని విఱ్ఱవీగటం కాదు. అధికమైన ఉద్యోగములు చేస్తున్నామని విఱ్ఱవీగటం కాదు. భగవంతుని ప్రేమను సాధించామనే దానికి ఆనందించాలి. ఆ ప్రేమయే సర్వమునకు మూలాధారము. ఏ సాధనలు చేసినా ప్రేమ ఆధారంతోనే చేయాలి. నవవిధభక్తులుంటున్నాయి.

*శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్*
*అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్.*

ఈ నవవిధ మార్గములలో ప్రేమచేతనే సాధించాలి. ప్రేమయే అన్నింటికి మూలాధారము. ప్రేమ అంతర ప్రవాహము. ఆ ప్రవాహము మనము పెంచుకుంటే ఏ బాధలనైనా సులభంగా సాధించుకోవచ్చు.

నేర్పవలసిన విద్య ఆధ్యాత్మ విద్యయే

విద్యార్థులారా! యువకులారా! యువతులారా!

మీరు నేర్చిన విద్యలు గొప్పవి కావు. నేర్వవలసిన విద్య దైవ విద్యయే. ఈ విద్యను నేర్చుకొంటిమా సర్వవిద్యలు వశమైపోతాయి. ఈ నాలుగు దినములు ప్రశాంతినిలయములో నిల్చి, జీవితము గడిపి నిరంతరము మననము చేసుకుంటూ తద్వారా మీ భక్తి ప్రపత్తులు సేవాభివృద్ధులుకూడా గావించుకుంటూ జీవితము సార్థకము చేసుకుంటూ రండి. ఇక్కడ ఉండి మాత్రమే భక్తి ప్రపత్తులు ప్రదర్శించి ప్రయోజనం లేదు. ఎక్కడకు పోయినా ఈ భక్తి ప్రపత్తులు మీ వెంటనే నీడగా ఉంటుండాలి. నీ నీడ నిన్ను వదలి ఏవిధంగా పోదో అదేవిధంగా నీ ఆత్మానందము నిన్ను వదలి పోకూడదు. అప్పుడప్పుడు మననం చేసుకుంటూ రండి. 'ఓ! ప్రశాంతినిలయంలో చేరాము. స్వామి చెప్పారు యీవిధంగా. మేము విన్నాము' అని మీరు మాట్లాడుకుంటూ రండి. మననము చేస్తుంటే ఎంతైనా అభివృద్ధి వస్తుంది. పశువులు పచ్చని గడ్డి చూచి గబగబ తినివేస్తాయి. త్వరత్వరగా తినేస్తాయి. కానీ, తిరిగి తన స్వస్థానమైన గాటికి పోయి నెమరువేసి, నెమరువేసి చక్కగా జీర్ణింప చేసుకుంటుంది. అదే రీతిగా ఇక్కడ మీరు త్వరత్వరగా విన్నారు. మీ స్వస్థానమునకు తిరిగి చేరి మననము చేసుకొని జీర్ణించుకోవాలి. అప్పుడే ఈ ఆహారము యొక్క శక్తి మీకు పుష్టినిస్తుంది. ఈ పుష్టియే సంతుష్టినిస్తుంది. కనుక, మీరు దేనికీ సందేహపడనక్కరలేదు. దైవ విశ్వాసము పెంచుకోండి. సేవను మీరు అభివృద్ధి పరచుకోండి. సేవ ద్వారా జీవితము సార్థకమౌతుంది. ఈ మాటలను పవిత్ర సూత్రములుగా మీరు భావంచుకోవాలి. ఇంకా పదిమందిని మీరు పెంచాలి. ఒక్కొక్క వ్యక్తి పదిమందిని పెంచుకుంటూ పోతే దేశమంతా ఎంత బాగుపడిపోతుంది! ప్రతి ఒక్కరూ ప్లస్ ప్లస్ చేస్తూ పోవాలి. అప్పుడే జగత్తంతా ఏకమై పోతుంది. అప్పుడే సర్వము ఏకాత్మభావము కుదిరిపోతుంది.

*మంచి పేరుతో మంచి పనులతో మంచిగా జీవించండి*

యువకులారా! నిత్యమూ మీకు చాలా శ్రమనందిస్తున్నానేమో. కానీ, మీకోసం ఎన్ని శ్రమలైనా పడతాను. మీరు బాగుపడితే చాలు. మీరు బాగుపడి సమాజమును బాగుపరిస్తే అదే ఆనందము. పల్లెల సేవలకు పోయినప్పుడు అమితంగా ఖర్చు చేసుకొని శ్రమలకోర్చుకోకండి. ఆ పల్లెల వారితోనే ఆ పనులు చేయించి వారికి సంస్థల విషయము విశదీకరించి వారితోనే ఆ పల్లె అభివృద్ధి గావించటానికి పూనుకోవాలి. అయితే ఈ సేవయందు యింటిలో మాత్రం ట్రబుల్ యిచ్చి పోకూడదు. తల్లిదండ్రులను సంతోషపెట్టి తరువాత సేవకు పో. కొంతమంది పిల్లలు చెబుతారు, 'స్వామీ! తల్లిదండ్రులు సేవకు పంపరని'. తల్లిదండ్రులకు చక్కగా చెప్పు. 'నాన్నా! తిని కూర్చోటానికా దేహము వచ్చింది. పదిమందికి సేవ చేయాలి. పరోపకార నిమిత్తము ఈ శరీరము వచ్చింది. నీవూ చేయాలి' అని తండ్రికి కూడా చక్కగా చెబితే ఆయన కూడా కొంత బుద్ధి తెచ్చుకుంటాడు. ఆవిధంగా మంచి మాటలచేత చెబుతే వారు కూడా అర్థము చేసుకుంటారు. లేకపోతే వారనుకుంటారు, పదిమంది గ్యాంగు మాదిరి పోయి ఏమి చేస్తున్నారోనని డౌట్‌గా ఉంటుంది. కాబట్టి, వారికి చెప్పినట్లుగా ప్రవర్తించు. బయట కూడా మంచిగా ప్రవర్తించు. అప్పుడు తల్లిదండ్రులు ఆనందిస్తారు. కొడుకులు పుట్టినప్పుడు కాదు ఆనందము. కొడుకు పుడితే తీపి పంచుతాము. కానీ, అది కాదు ఆనందము.

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా
పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!

ఎప్పుడు సమాజము ఆ పుత్రునిజూచి పొగడుతుందో అప్పుడు పుత్రోత్సాహము వస్తుంది తండ్రికి. సమాజములో సత్కీర్తి వచ్చినప్పుడు తండ్రికి ఆనందము. పుత్రుడు మంచి పేరు తెచ్చుకున్నప్పుడు ఆనందము. మంచి పేరు తెచ్చుకోండి.

మంచి పనులు చేయండి. మంచిగా మీరు జీవించండి. ఇదియే స్వామియొక్క ఆశయము. మీరు నాలుగు దినములు మంచిగా ప్రవర్తించారు. మంచిగా ఉన్నారు. కొన్ని సమయములలో emotional excitement కూడా ఉంటున్నాది. అది కొంచెం చల్లార్చుకోవాలి. దీనిని మీరు కంట్రోలు చేసుకుంటే ఎంతో ఆదర్శ జీవులుగా ఉంటారు. మాటలు తగ్గించుకోండి. కొంత వరకు సత్యాన్ని గుర్తించండి. పవిత్రత పెంచుకోండి. జీవితమును ఆనందముగా జీవించండి. జీవితములో యేదీ happy లేదు. అప్పటికప్పుడు వస్తుంది. అప్పటికప్పుడు పోతుంది. అంతా passing clouds. కానీ, permanent happyness ఒక్క దైవత్వముతో మాత్రమే ఉంటున్నాది. ఇది heart to heart, love to love. ఇదే మీరు పెంచుకోవాలి. ఇది మీ నిజమైన భక్తిప్రపత్తులకు నిదర్శనము. స్వామి ఆశీర్వాదములు అమితంగా ఉంటున్నాయి. మీరు సుఖంగా, శాంతిగా, ఆనందముగా భక్తిప్రపత్తులతో జీవించి దేశానికి సరైన సేవలు చేయాలని నేను ఆశీర్వదిస్తూ నా ప్రసంగము విరమిస్తున్నాను.

(1997 జూలై 19వ తేదీ యువకులకు భగవాన్ బాబావారి దివ్యసందేశము)